క్లుప్తంగా

సెలవులు త్యాగం..



సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో హెచ్‌ఎం త్రినాథరావు

బాడంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సెలవులు త్యాగం చేసి విధులకు హాజరవుతూ పలువురికి ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం కల్పించిన 22 సెలవుల్లో సగం కూడా వినియోగించుకోకుండా, పాఠశాలకు హాజరవడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌ఎం ఎస్. త్రినాథరావు, ఉపాధ్యాయులు జి.త్రినాథ్, కె.సాయిసతీష్, కె.ఈశ్వరరావు, డి.రమేష్, ఎస్.శంకరరావు, డి.శారద చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులను హెచ్‌ఎం త్రినాథరావు సోమవారం సత్కరించారు.

మునగ మొక్కల పంపిణీకి చర్యలు



సంగాంలో మునగ నర్సరీ పరిశీలిస్తున్న ఏసీ చిరంజీవి

వంగర: మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లోని మహిళా సంఘాలకు 60వేల మునగ మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు ఏసీ అలుగోలు చిరంజీవి తెలిపారు. మండలంలోని సంగాం గ్రామంలో ఏర్పాటు చేసిన మునగ మొక్కల నర్సరీని సోమవారం ఆయన పరిశీలించారు. ఒక్కో మహిళకు ఐదు మునగ మొక్కలు చొప్పున పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏపీఎం బాసిన గోవిందరావు ఉన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి



బిళ్లాణిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

సంతకవిటి: జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకం కింద మండలంలో చేపట్టిన భూముల సమగ్ర రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ ఎ.సులోచనారాణి కోరారు. బిళ్లాణి, తలతంపర గ్రామ సచివాలయాల వద్ద సోమవారం రైతులతో సమావేశమై భూముల రీసర్వేపై అవగాహన కల్పించారు. సర్వే జరుగుతున్న సమయంలో రైతులు వారి భూమికి సంబంధించిన పత్రాలను వీఆర్వో, సర్వే సిబ్బంది చూపించి వారికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

పద్మశ్రీ యడ్లకు తానా సత్కారం



పద్మశ్రీ యడ్లను సత్కరిస్తున్న తానా సంఘం

రాజాం: సంతకవిటి మండలం మందరాడ గ్రామానికి చెందిన పద్మశ్రీ యడ్ల గోపాలరావును నార్త్ అమెరికా తెలుగు సంఘం(తానా) ఘనంగా సత్కరించింది. ఈనెల 1న హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తానా చైతన్య స్రవంతి బహుజనకళా మహోత్సవం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా పద్మశ్రీ అవార్డులు పొందిన పలువురు తెలుగు కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో తానా అధ్యక్షుడు లావు అంజయ్య, తానా పూర్వ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, పద్మశ్రీ కోలకలూరు ఇనాక్ తదితరులు యడ్లను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

బ్యాడ్మింటన్‌లో ఏపీపురం విద్యార్థి ప్రతిభ



శివమణిని అభినందిస్తున్న హెచ్‌ఎం, తదితరులు

రేగిడి: మండలంలోని ఏపీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బి.శివమణి రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచాడు. అండర్–14 బాలుర విభాగంలో శ్రీకాకుళం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరఫున ఈ పోటీల్లో పాల్గొన్నాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించిందని పాఠశాల పీడీ బి.సంతోషిమాత సోమవారం తెలిపారు. విద్యార్థి శివమణిని పాఠశాల హెచ్‌ఎం ఆర్‌వీజీఎన్ మురళీకృష్ణతోపాటు స్టాఫ్ సెక్రటరీ ఆర్‌వీజే నాయుడు, వేణుగోపాల్, హరిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం ఆలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. వేకువజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు బారులుతీరారు. గోవింద నామ సర్మరణతో ఆలయాలు మార్మోగాయి. వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకుంటే మోక్షం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

– సాక్షి నెట్‌వర్క్



బాడంగి: పాల్తేరు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూలంగి సేవ



సంతకవిటి: మిర్తివలస వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు



రాజాం : అంతకాపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద భక్తుల దీపారాధన



రామభద్రపురం: బూసాయవలస వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు



వంగర: సంగాంలో సంగమేశ్వరుడుకి రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు



రాజాం సిటీ: రాణావీధిలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు



బొబ్బిలి రూరల్: కల్యాణ వేంకటేశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు



బొబ్బిలి: వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



తెర్లాం గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి

తెర్లాం: గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరు కోసం అధికారులు ప్రణాళికలను సిద్ధం చేయాలని తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. స్థానిక ఒకటో గ్రామ సచివాలయంలో సర్పంచ్ బోనెల రూప అధ్యక్షతన జీపీడీపీ గ్రామ సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో గ్రామాభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల నెంచి పింఛన్‌ను మరో 250 రూపాయలు పెంచారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రూప, ఎంపీటీసీ సభ్యుడు ఆనందరావు, ఉప సర్పంచ్ ఆదిలక్ష్మి శంకరరావు, ఎస్.వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు, పంచాయతీ ఈఓ సూరిబాబు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

అగ్నిఅస్త్రంతో కత్తెరపురుగు నివారణ

రాజాం సిటీ: మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగును అగ్నిఅస్త్రంతో నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ పీఆర్పీ రమాదేవి అన్నారు. మండలంలోని పొగిరి గ్రామంలో సోమవారం అగ్నిఅస్త్రం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగుతోపాటు కాండంతొలిచే పురుగు ఆశిస్తుందని, వాటి నివారణకు అగ్నిఅస్త్రం సమర్థవంతంగా ఉపయోగపడుతుందన్నారు. దీని తయారీకి 15 లీటర్ల ఆవు మూత్రం, కేజీ పచ్చిమిర్చి, కేజీ వెల్లుల్లి, కేజీ పొగాకు, మూడు కేజీల వేపఆకుల మిశ్రమాన్ని మూడు నుంచి నాలుగు పొంగులు వచ్చేంత వరకు మరగబెట్టాలి. దానిని చల్లార్చిన తరువాత ఎకరం పొలంలో పిచికారి చేసుకుంటే పంటను ఆశిస్తున్న పురుగులతో



అగ్నిఅస్త్రం తయారీ విధానాన్ని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పాటు చీడపీడల నివారణకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీ పాత్రుని వెంకటరమణ, రైతులు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేకు సహకరించాలి

తెర్లాం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని అరసబలగ, టెక్కలివలస గ్రామాల్లో భూముల రీసర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూథింగ్ కార్యక్రమానికి సంబంధించి సోమవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూముల రీసర్వేకు ముందు చేపట్టనున్న గ్రౌండ్ ట్రూథింగ్‌లో రైతులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. సర్వేయర్లు పొలాల వద్దకు వచ్చేటప్పుడు భూ యజమాని పేరు, ఎలా దాఖలాపడిందో దాని వివరాలు తెలియజేయాన్నారు. కార్యక్రమంలో అరసబలగ సర్పంచ్ సాయిరాం, పెరుమాళి



టెక్కలివలసలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

సర్పంచ్, ఎంపీటీసీ ప్రతినిధులు అప్పలనరసింహరాజు, అప్పలరాజు, మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓలు శ్రీను, రవి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మీ ఇంటి పెద్ద కొడుకు

- మాట ఇచ్చాడు.. నిలబెట్టుకున్నాడు..
- దేశంలోనే అధిక మొత్తంలో పింఛన్ ఇస్తున్న రాష్ట్రం ఏపీ
- డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: జగన్‌మోహన్‌రెడ్డి మీ ఇంటి పెద్ద కొడుకు.. ప్రజాసంకల్ప యాత్రలో మీ అందరి కష్టాలను చూసి పింఛన్ మొత్తాన్ని పెంచుతానని మాట ఇచ్చారు.. ఆ ప్రకారం అధికారంలోకి వచ్చిన మూడో ఏట రూ.2000 నుంచి రూ.2,750కు పెంచారని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పేర్కొన్నారు. మెంటాడ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 7,569 మందికి పింఛన్లు పంపిణీ పూర్తయిందన్నారు. దేశంలో ఇరత రాష్ట్రాలతో పోల్చి చూస్తే అధిక మొత్తంలో పింఛన్ అందజేస్తున్నది ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమేనన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలతో పాటు 24 రకాల పింఛన్లను అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మండలంలోని లక్ష్మీపురం వంతెన మంజూరు చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెంచిన పింఛన్ రూ.2,750 మీకు అందించి, మీ మధ్యనే మమ్మలను నూతన సంవత్సర వేడుకలు జరుపుకో



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

వాలని ఆదేశించారంటే జగన్‌మోహన్‌రెడ్డికి మీరంటే ఎంత అభిమానమో అర్థమవుతుందన్నారు. దేశంలోనే రెండవ అతిపెద్ద గిరిజన వర్సిటీని మెంటాడ మండలంలో ఏర్పాటుచేసేందుకు ముఖ్యమంత్రిని ఒప్పించి, కుంటినవలసలో త్వరలో శంకుస్థాపన జరిగేలా కృషి చేసిన పీడిక రాజన్నదొరకు మండల వాసులంతా రుణపడి ఉంటారన్నారు. సుమారు 500 ఎకరాల్లో రూ.550 కోట్లతో నిర్మించే వర్సిటీ వల్ల ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, జెడ్పీటీసీ లెంక సన్యాసప్పల నాయుడు, వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్‌చక్రవర్తి, సాలూరు ఏఎంసీ చైర్మన్ జి.అనంతకుమారి, ఎంపీడీఓ తివిక్రమ్‌రావు, తహసీల్దార్ ఆదిబాబు, రత్నాకర్‌నాయుడు, సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ పతివాడ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

రాజాం: రాజాం క్లస్టర్ పరిధిలో రాజాం, రేగిడి, సంతకవిటి మండలాల్లో ఖాళీగా ఉన్న ఎనిమిది అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని సీడీపీఓ సిమ్మాలమ్మ సోమవారం తెలిపారు. రాజాం మండలం సీతంపేట అంగన్‌వాడీలో కార్యకర్త(ఎస్టీ), సంతకవిటి మండల మేడమర్తి అంగన్‌వాడీలో కార్యకర్త(ఎస్టీ), గుజ్జన్నపేట కేంద్రంలో ఆయా(బీసీ–డీ), రాజాం మండలం గెద్దవలసలో ఆయా (ఎస్సీ), కంచరాం–1లో ఆయా(ఓసీ), రేగిడి మండలం కోడిశ–1లో ఆయా(బీసీ–బీ), కందిశ–1లో ఆయా(ఎస్టీ), రేగిడి–2లో ఆయా(ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పదో తరగతి పాసై, 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగిన స్థానిక మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 7వ తేదీ లోగా రాజాంలోని సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

రికార్డులు పక్కాగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం సిటీ: గ్రామ సచివాలయాల్లో వివిధ శాఖలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. మండలంలోని గడిముడిదాం గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాను సచివాలయం నోటీస్ బోర్డులో వేలాడదీయాలని సూచించారు. స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

సకాలంలో గృహ నిర్మాణాలు

- హౌసింగ్ డీఈ అప్పయ్య

తెర్లాం: జగనన్న ఇళ్ల లే అవుట్‌లతో పాటు సొంత స్థలాలు ఇళ్లు నిర్మిస్తున్న వారు సకాలంలో పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ డీఈ పలగర అప్పయ్య అన్నారు. మండలంలోని ఆమిటి, కవిరాయునివలస గ్రామాల్లో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ డీఈ మాట్లాడుతూ, ఇంతవరకు నిర్మాణాలు చేపట్టని వారు ఈనెల 15లోగా పనులు ప్రారంభించాలన్నారు. లేనిపక్షంలో పట్టాలు రద్దు చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపుల్లో ఎటువంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయనతో పాటు ఆమిటి, కవిరాయునివలస సర్పంచ్‌లు నాగమణి, తిరుపతి



ఆమిటిలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ అప్పయ్య

నాయుడు, మండల గృహ నిర్మాణశాఖ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, హరి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఫలించని కలాసీ, మిల్లర్ల చర్చలు



చర్చలో పాల్గొన్న కలాసీలు, మిల్లర్లు, అధికారులు

బొబ్బిలి రూరల్: కూలి రేట్ల పెంపుపై కలాసీలు, మిల్లర్ల మధ్య సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన చర్చలు ఫలించలేదు. నెల రోజులుగా జరుగుతున్న చర్చలలో కొంతమేర పురోగతి సాధించినా, చర్చలు మాత్రం ఓ కొలిక్కి రాలేదు. రెండేళ్ల కిందట జరిగిన అగ్రిమెంట్ పూర్తికావడంతో తమకు 50 శాతం మేర రేట్లు పెంచి రెండేళ్లపాటు అగ్రిమెంట్ చేయాలని కలాసీలు డిమాండ్ చేస్తుండగా.. మిల్లర్లు నిరాకరించారు. దీంతో కలాసీలు ఈ నెల ఒకటో తేదీ నుంచి సమ్మెబాట పట్టడంతో మిల్లుల వద్ద ధాన్యం వాహనాలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో అధికారులు చొరవ తీసుకుని కలాసీలు, మిల్లర్లతో చర్చలు నిర్వహించగా.. కలాసీ సంఘ అధ్యక్షుడు భోగాది అప్పలస్వామి, కార్యదర్శి డి.వర్మ హాజరై 35 శాతం మేర కూలి పెంచాలని, తర్వాత 26 శాతం పెంచాలని కోరుతూ రెండేళ్ల పాటు అగ్రిమెంట్ చేయాలని కోరారు. మిల్లర్లు తొలుత 22 శాతం పెంచుతామని, మూడేళ్లు అగ్రిమెంట్ చేయాలని కోరారు. తర్వాత 26 శాతం పెంచడానికి, రెండేళ్ల అగ్రిమెంట్‌కు సహకరించారు. అయితే మిల్లర్లు ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి కాకుండా మార్చి వరకు నూతన ఒప్పందానికి గడువు కావాలని కోరడంతో దీనికి తాము అంగీకరించబోమని కలాసీలు తెలిపారు. దీంతో చర్చలు ఫలించలేదు. చర్చలో తహసీల్దార్ ఎస్.రాజారావు, సీఎస్‌డీటీ ఆర్.సాయికృష్ణ, న్యాయవాది మజ్జి జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పని, మడమ తిప్పని సీఎం జగన్



వంగర: వంగరలో పింఛన్లు అందిస్తున్న సర్పంచ్ భారతి, ఎంపీటీసీ పద్మ



రేగిడి: ఏపీపురంలో కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ అప్పలనరసమ్మ, తదితరులు



రాజాం సిటీ: బొద్దాంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్లు

రేగిడి: మాట తప్పని, మడం తిప్పని వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ దార అప్పలనరసమ్మ అన్నారు. మండలంలోని ఏపీపురం గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అర్హతే ప్రామాణికంగా, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్క వెంకటనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వంగర: పేదల పెన్నిధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వంగర సర్పంచ్ కనగల భారతి, ఎంపీటీసీ కనగల పద్మ అన్నారు. స్థానిక సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు కాంబోతుల భగవతి, కనగల పారినాయుడు, సచివాలయ కన్వీనర్లు బెవర అప్పలనాయుడు, దేవకివాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

రాజాం సిటీ: బొద్దాం గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సచివాలయ కన్వీనర్లు నక్క శ్రీను, నక్క వర్షిణి, గండి పైడిరాజు వలంటీర్లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.

రాజాం: పెనుబాక గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను జెడ్పీటీసీ బండి నర్సింహులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ బండి బోడెమ్మ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్ సామాజిక పెన్షన్లను పంపిణీ చేశారు. సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట, గొర్లెసీతారాంపురం, పారాది, అలజంగి, కమ్మవలస, తదితర గ్రామాలలో కమిటీ సభ్యులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతికుమారి, తదితరులు పింఛన్లు పంపిణీ చేశారు.

బాడంగి: మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాలలో 90 శాతం మంది పింఛన్ దారులకు నగదు అందజేశారు.ఈ నెలలో కొత్తగా 300 మందికి పింఛన్ మంజూరైంది.

రామభద్రపురం: మండల వ్యాప్తంగా సచివాలయ కన్వనర్లు సమక్షంలో రెండో రోజు సామాజిక పింఛన్ల పంపిణీ ఉత్సాహంగా సాగింది. మండలంలో 7,805 మంది లబ్ధిదారులు ఉండగా తొలి, రెండోరోజు సుమారుగా 80 శాతం మందికి పింఛన్లు అందజేసినట్టు అధికారులు తెలిపారు.



రాజాం: పెనుబాకలో పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు



తెర్లాం: పెన్షన్‌లు పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్లు, ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి



బొబ్బిలి రూరల్: కమ్మవలసలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న సర్పంచ్ వసుంధర



బాడంగి: ముగడ కాలనీలో కన్వీనర్ శివప్రసాద్ సమక్షంలో పింఛన్లు పంచుతున్న వలంటీర్